## కరుగుతున్న గుట్టలు...
# పట్టించుకోని అధికారులు

- కరెంటు చౌర్యంతో కరుగుతున్న రాళ్ల గుట్టలు
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వ్యవసాయ పొలాలకు వెళ్తున్న రైతులు
- మామూళ్ల మత్తులో జోగుతున్న సంబంధిత అధికారులు





**ఆమనగల్లు, సెప్టెంబర్ 07(నేటి దర్శిని):** ఆమనగల్లు పట్టణ కేంద్రం నుండి మాడుగుల వెళ్లే దారి ప్రక్కనగల మేకలగుట్ట వెనక భాగంలో గుట్టలు కరుగుతున్నాయి. వ్యవసాయ రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్తు దుర్వినియోగ పరుస్తూ,గుట్టలను కరిగిస్తున్నారు.సాగుకు వినియోగించాల్సిన కరెంటును కొందరు ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు.ఈ క్రమంలో రాళ్ల గుట్టలు కనుమరుగు అవుతు న్నాయి.దీనిపై విద్యుత్తు శాఖతో పాటు మైనింగ్, రెవెన్యూ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.ఎలాంటి అనుమతులు లేకుండా వీటిని డైన మెట్ల సహాయంతో కొందరు ధ్వంసం చేస్తున్నారు. అనంతరం ఇళ్ల నిర్మాణాలకు అనుగుణంగా ఉపయోగపడే రాళ్లు, పొలాల ఫెన్సింగ్ కు అవసరమగు కడీలను రూపొందిస్తున్నారు. గతంలో వడ్డెరులు తమ శ్రమశక్తి ద్వారా మాత్రమే రాళ్లను తయారు చేస్తూ ఉపాధి పొందే వారు. ఇప్పుడు వారే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మనుషులను రప్పించి రాళ్లను, కడీలను సిద్ధం చేస్తున్నారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన ప్రస్తుత తరుణంలో శ్రమశక్తితో కాకుండా యంత్ర పరికరాలు ఉపయోగిస్తూ సునాయాసంగా గనేటురాళ్లను, కడీలను తయారు చేస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే విద్యుత్తును గుట్టల సమీపంలోని రైతుల పొలాల నుంచి తీసుకుంటున్నారు. కరెంటు లేని సమయంలో జనరేటర్ సహాయంతో రాతి కడీలను, గనేటు రాళ్లను తయారు చేస్తున్నారు.

### నిబంధనలకు తిలోదకాలు

నిబంధనల ప్రకారమైతే రాళ్ల తొలగింపునకు మైనింగ్, రెవెన్యూ అధికారుల అనుమతులు తీసుకోవాలి. ఏ గుట్టలో ఎంత మేరకు స్థలం రాళ్ల తయారీకి అవసరమో దరఖాస్తు చేసుకోవాలి. మైనింగ్, రెవెన్యూ అధి కారులు పేర్కొన్న స్థలాన్ని పరిశీలించి అను మతి ఇవ్వొచ్చు లేదా ఇవ్వకపోవచ్చు. ఒకవేళ అనుమతులు పొందితే విద్యుత్తు కోసం సంబంధిత శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. వారూ పరిశీలించి మీటరు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలి. ఎప్పటి కప్పుడు విద్యుత్తు వినియోగించిన దానికి అనుగుణంగా బిల్లులు చెల్లించాలి అయితే ఆయా నిబంధనలేవీ కనుచూపుమేర కనపడట్లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుట్టలకు సమీపంలో వ్యవసాయ మోటార్లు కలిగిన రైతులను మచ్చిక చేసుకొని అక్రమంగా విద్యుత్తు పొందు తున్నారు. ఫలితంగా విద్యుత్తు దుర్వినియోగం అవుతూ సంబందిత శాఖకు నష్టం వాటిల్లుతుందని ప్రజలు అనుకుంటున్నారు. కరుగుతున్న గుట్టలను, ప్రజల సంపదను కాపాడాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను ప్రజలు వేడుకుంటున్నారు.

## మిడ్జిల్‌లో నూతన కమిటీల ఎన్నిక

- అన్ని గ్రామాల్లో కమిటీల నిర్మాణానికి కృషి చేయాలి: బొర్ర బిక్షపతి మాదిగ



**మిడ్జిల్, సెప్టెంబర్ 7, (నేటి దర్శిని):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపడుతున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ విద్యార్థి సమాఖ్య సంస్థాగత నిర్మాణాల్లో భాగంగా మిడ్జిల్ మండల కేంద్రంలో నూతన కమిటీల ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. పడిగాళ్ల సురేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి బొర్ర బిక్షపతి మాదిగ, టైగర్ జంగయ్య మాదిగ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొర్ర బిక్షపతి మాదిగ మాట్లాడుతూ.. మిడ్జిల్ మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి, సంస్థను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మిడ్జిల్ మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడిగా కావలి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కావలి వెంకటయ్య, బుచ్చయ్య, శివ, భీమ్‌రాజ్, సురేష్, ఆంజనేయులు, వంశీ, రాజు, మహేష్, అంజి, సుదర్శన్, భాస్కర్, వెంకటయ్య మున్నూరు కాపు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, సెప్టెంబర్ 07(నేటి దర్శిని):** అసెంబ్లీ స్పీకర్ అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిపై ఓ ఎమ్మెల్సీ బూతులు తిడుతూ, అమర్యాదకరంగా మాట్లాడటాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తీవ్రంగా ఖండించారు.స్పీకర్‌ను కించపరిచేలా అసభ్య పదజాలంతో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థకు, శాసనసభ గౌరవానికి అవమానకరమని ఆయన పేర్కొన్నారు. రాజకీయ విభేదాలు ఉండవచ్చు, విధానాలపై విమర్శలు చేయవచ్చు, కానీ రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తిని వ్యక్తిగతంగా కించపరిచేలా మాట్లాడటం ఏ విధంగానూ సమర్థనీయం కాదని కసిరెడ్డి అన్నారు.దళితులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉన్నత స్థాయికి ఎదిగి, అత్యున్నత పదవులు అలంకరించినప్పటికీ వారిపై వివక్ష, చిన్నచూపు, అవమానకర వ్యవహారశైలి ఇంకా కొనసాగడం దురదృష్టకరమన్నారు.సదరు ఎమ్మెల్సీపై శాసనసభ నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పీకర్ ని కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు.



# రైతులకు కరెంటు కోతలు లేకుండా సరఫరా చేయాలి

- ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- లేకుంటే ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- బిజెపి రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి





**మిడ్జిల్, సెప్టెంబర్ 7, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ ఊర్కొండ మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కె. రాజేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, పెండింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే రైతుల తరఫున పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.రైతుల సమస్యలను ప్రభుత్వం, విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించాలని ఆయన కోరారు.రాస్తారోకోలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మారెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పరుశరామ్, బ్రహ్మాచారి, వెంకటరెడ్డి, వెంకటేష్, శివ, శ్రీను, సుందర్‌రెడ్డి, రాములు, శేఖర్‌రెడ్డి, కిరణ్ నాయక్, పూర్ణ, వేణునాయక్, ప్రదీప్ గౌడ్, రాజు నాయక్, సందీప్, మల్లేష్, గోపి తదితరులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో దుర్యోధన దుశ్శాసన పాలన

- బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంజి కృష్ణ



**మిడ్జిల్ సెప్టెంబర్ 07, (నేటి దర్శిని):** తెలంగాణలో ప్రజాపాలన కాకుండా దుర్యోధన--దుశ్శాసన పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంజి కృష్ణ తీవ్రంగా విమర్శించారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించడం, చీరలు లాగడం, జుట్టు పట్టుకుని లాగడం ప్రజాస్వామ్యానికి అవమానమన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు నల్ల దుస్తులతో అసెంబ్లీకి వెళ్లడంలో తప్పేముందని ప్రశ్నించారు. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజాప్రతినిధులపైనే ఇలా వ్యవహరిస్తే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని, పాలన చేతకాకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని గంజి కృష్ణ డిమాండ్ చేశారు.

## నకిలీ హిజ్రా మాఫియాపై పోలీసుల ఉక్కుపాదం



**హైదరాబాద్ సెప్టెంబర్ 07 (నేటి దర్శిని):** హైదరాబాద్ లోని గృహప్రవేశంలో హిజ్రాల పేరుతో రూ. 50,000 డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులను వేధించి, అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటన తీవ్ర కలకలం రేపింది.బాధితుల వీడియో వైరల్ కావడంతో, రాష్ట్రవ్యాప్తంగా బలవంతపు వసూళ్లు, వేధింపులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. శుభకార్యాలు, వ్యాపార వేదికల వద్ద భయభ్రాంతులకు గురిచేసే ముఠాలపై ఎఫ్ఐఆర్లు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. నేరపూరిత వసూళ్లకు పాల్పడే వారిని, గౌరవంగా జీవించే ట్రాన్స్ జెండర్లను వేర్వేరుగా చూస్తూ అక్రమ దందాలపైనే ఉక్కుపాదం మోపనున్నారు.

